


నగరంలో, నడుస్తున్న చరిత్రలో ఓ రోడ్డు —

ఆ రోడ్డు మీద నాగరికత ప్రసాదించిన అలంకారాలు- సైకిళ్ళు, రిక్షాలు, కార్లు, బస్సులు నిత్య దృశ్యాలు —



# చిలక చెప్పని జోస్యం

పెందుర్తి మాస్టర్జీ

ఆ రోడ్డు ప్రక్క, తాలూకా ఆఫీసు గోడ బయట ఓ చెట్టుంది. ఆ చెట్టు దశాబ్దం నాటిది. ఆ చెట్టు క్రింద మనిషి అర్ధ శతాబ్దం నాటివాడు. అది జైమినీ కుటీరం అనుకుంటే, అశోక వృక్షం క్రింద ముక్తి మంటపి మీద కూర్చున్న విద్యాధికుడులా వుంటాడాయన.

ఆయనకీ పేరుంది. ఆ పేరుతో లోకానికి నిమిత్తంలేదు. నిమిత్తమాత్రుడయిన అతన్ని పిలవవలసిన అవసరం గలవాళ్లు 'మూర్తి' అని ముచ్చటగా పిలుస్తారు. యాభైఏళ్ళ వయసులో 'ఏమిటి సాధించింది?' అని ఆలోచించలేదు. ఎదిగిన కూతురుకి ఎలా పెళ్ళి చెయ్యాలా అని ఆలోచిస్తుంటాడు.

మూర్తి బ్రతుకుతుంది ఓ చిలకవల్ల. ఆ చిలక అతని ప్రక్కనే వుంది. చిలక చుట్టూ పంజరం వుంది. పంజరంలో చిలక వుంది. పంజరం ముందు గోనె ముక్క మీద అట్టముక్కలున్నాయి. పది పైసలు వేస్తే, ఓ అట్టముక్క తీసియిచ్చి చక్కాపోతుంది. యీ లాంటి పది పైసలు చాలా కావాలి. అందుకే మధ్యలో గవ్వల జాతకం అంటూరూపాయి తీసుకుంటాడు. అతని చర్మం ఎరుపు. జీవితం మాత్రం నలుపు. తల పండిపోయింది కాని ఆశలు ఎండిపోలేదు. ఎండిపోయిన శరీరానికీ మొండిగా వుండిపోయిన మనసుకీ సొంతదారుడు మూర్తి. మూర్తి చిలకను బ్రతికిస్తున్నాడు, చిలక మూర్తిని బ్రతికిస్తుంది. చిలక ఎగిరి వెళ్ళగలిగితే వెళ్ళి బ్రతకగలదు. కాని చిలక ఎగిరి బ్రతికితే మూర్తి చచ్చిపోతాడు. అందుకే చిలకంటె మూర్తికి ప్రాణం. యాభై యేళ్ళ మూర్తి జీవితంలో అనుభవానికి పనికి రాని గతం, వేదాంతానికి పనికివచ్చే సంఘటనలు తప్ప మరేమీ లేవు.

కాబట్టి తన జీవితం నిశ్శబ్దాక్షరం.

ప్రొద్దుట గంజి త్రాగుతున్నప్పుడు పెళ్ళాం అడిగింది "అమ్మాయికి పెళ్ళీడు వచ్చింది" అని. అప్పటికి ఏ అరవై సార్లో అని వుంటుంది. అరవై ఒకటోసారి మరి కాస్త శ్రద్ధగా అంది. తను బుదిగా విని బుర్ర వూపాడు. సశాస్త్రీయంగా తన బాధ్యత అది, బ్రతుకులో బరువయింది కూడా అదే. దరిద్రుడయినా దర్భపుల్లలా ఎదిగిపోయిన కూతురికి మంచి సంబంధం తేవాలనుకున్నాడు. అది హైక్లాసు జోలికి పోకుండా, లోక్లాసు అల్లుడు గురించి ఆలోచించాడు.

ఎండకుమండో, కడుపు నిండకో చిలక అరుస్తూంది.

అరటిపండు సగంచేసి చిలకకు పెట్టాడు చిన్న అరటిపండుతో చిలక ఆకలి తీరుతుంది. కాని తన డొక్కల మీద కొట్టే ఆకలి చిన్నదికాదు. జేబులోనుండి బీడీతీసి కొరివి పెట్టాడు. రోడ్డువైపుకు చూశాడు.

దూరంగా లంగావోణీ వేసుకున్న పిల్ల. తన కూతురేమో అనుకున్నాడు. చూపు సరిగ్గా కనపట్టంలేదు. నిట్టూర్చి నిరీక్షించాడు. తన కూతురుకాదు. తన ముందుగా వెళ్ళిపోయింది.

"ఏమోయ్ కూడు రాలే" చెప్పులుకుట్టే చెంచయ్య హోటల్లో తిండి తిని చెయ్యి తుడుచుకుంటూ, త్రేపుకుంటూ తీరుబడిగా అడిగాడు

"అమ్మాయి రాలేదు"

"మీ అమ్మాయికి పెళ్ళి ఎప్పుడు చేస్తావ్?"

విసిగిపోయిన ప్రశ్నకు, చెప్పలేనిజవాబు.

"ఎపుడికో ఒకడికి ముడెట్టెయ్యి. ఎదిగిన పిల్ల యింట్లోవుంటం మంచిదికాదు" అతని మాటల్లో సలహాలేదు. వ్యంగ్యం ధ్వనిస్తుంది. తను తలూపి వూరుకున్నాడు.

కడుపు నిండిన చిలక అరుస్తుంది. ఆకలితో తన ప్రేవులు అరుస్తున్నాయి. "మలికి పెళ్ళి ఎప్పుడు?" మనసులో అనుకున్నాడు. చిలక వైపు చూశాడు వేదాంతిలా నవ్వుకున్నాడు.

తన కొడుకు వుద్యోగం కోసం, గెలవనున్న దావాకోసం, రానున్న ఆస్తికోసం యివ్వవలసిన బాకీకోసం చిలకను అడుగుతారు. కానీ తన కూతురు పెళ్ళిగురించి చిలక చెపుతుందా?

"టైమెంతయింది?" అడిగాడు దారిన పోయే దానయ్యను. అతను చురచురచూసి వెళ్ళిపోయాడు. మూర్తి విస్తుపోయాడు. అతని గడియారం చెడిపోయివుంటుందా? తనంటే నిరక్ష్యంతో చెప్పలేదా? తన మాట వినిపించలేదా? — చిలకజోస్యం చెప్పదు.

మల్లి గాలికి కొట్టుకువచ్చే మల్లిపువ్వులా వచ్చింది. కాని మల్లి అందం మల్లిమొగ్గ లాంటిదయినా, వేసుకున్న బట్టలుమాత్రం మారేడుకాయ రంగులో వున్నాయి. కారేజి ముందు పెట్టింది. పైటచెంగుతో ముఖం, మెడక్రింద చెమటను తుడుచుకుంది. సంచిలో సీసాతో తాలూకాఆఫీసు పంపులో నీళ్ళు తెచ్చింది.

మూర్తి పచ్చడిమెతుకుల్ని పంచభక్ష్య పరమాన్నంలా తింటున్నాడు. మూర్తి ఏదో అడగాలని మలివైపు చూశాడు. మల్లిదూరంగా యెవర్నొచూసిముసిముసిగా నవ్వుతూంది. తను యిలా చూడటం మూడోసారి. అతనెవరో అక్కడ సెకిలుతో నిలబడినవాడిని చూసి నవ్వటం మూడోసారి.

చెంచయ్య మాటలు గుర్తుకొచ్చాయి.

మూర్తి తలవంచుకొని మెతుకులు కొరుకుతున్నాడు

మెదడులో రకరకాల ఆలోచనల రంగులు.

మళ్ళీ దొంగచూపులు చూస్తూనేవుంది.

మళ్ళీ అతన్ని ప్రేమించిందా? అతను మళ్ళీ కలిసి వచ్చివుంటారా? మళ్ళీ దారి తప్పిన పని చేసిందా? అతనెవరు? ఈ కథకి ముగింపు?

చిలక జోస్యం చెప్పదు.

మళ్ళీ కారేజి సర్దుకొని తొందర పని వున్నట్టు వెళ్ళిపోయింది.

వూహల గడ్డిపోచలమధ్య గాలి తెర లాటి మనసు. అయోమయపు ఆశ. దారుణాలు ఎరుగని దైవత్వం. అందానికి సామ్రాజ్యపురాణి.

రెండు చెమట బిందువులు నుదుటినుంచి జారి కనురెప్పలకు అంటుకున్నాయి. ప్రశ్నలు అతని కళ్ళను కలవరపరుస్తున్నాయి. "రేపు"అనబడే గదికి ఏరోజుకు ఆరోజు తలుపులు వేసే వుంటాయి. వాటంతటనే తెరుచుకునే తలుపుల్లో ఏముందో ఏంతెలుస్తుంది?

* * *

వీధులలో విద్యుద్దీపాలు. మేడలలో మెర్క్యురీ దీపాలు.

మెల్లగా యిల్లు చేరాడు.

శవం పోయిన ఇల్లులా, వూరి చివర వల్లకాడులా నిశ్శబ్దంగా వుంది ఇల్లు. ఆ గుడిసెలో గుడ్డిదీపం వేదాంతిలా వెలుగుతూంది. తన అడుగుల చప్పుడికి తడికె కదలికకు తల తిప్పింది భార్య. బావురుమనలేక గొంతు బిగపట్టి మూలుగుతున్నట్టు ఏడ్చింది. మూర్తివిస్తుపోయాడు. చిలక పంజరం ప్రక్కనే పెట్టి సమీపించాడు.


"ఏమయింది?"

"మల్లి .... మల్లి ...." ఆత్రుతగా ఆమె ముఖాన్ని వెతుకుతున్నాడు "మల్లి లేసి పోయింది. రైలెక్కుతుంటే రాఘవులు చూశాడంట. ఎవడితో పోయిందో?"

మూర్తి మెదడులో నరాలు చిక్కుబడ్డాయి. తన కూతురు ఎక్కడుందో? ఎలా వుందో? ఏమవుతుందో? ఏ అంగడిలో అంగడి బొమ్మ అవుతుందో?

—చిలక జోస్యం చెప్పదు. ●

---



# కళ్ళు

చైతన్య

మాటలతో వ్యక్తం చేయలేనిభావాలన్నీ కళ్ళతో చేయవచ్చని యెప్పుడో, యెక్కడో, బహుశ పూర్వాశ్రమంలో చదివినట్టు గుర్తు. ఈ బొంబాయి నగర జీవితానికి అలవాటుపడ్డాక అన్నీ మర్చిపోయాను సార్. "నువ్వు పూర్వజన్మలో చేసుకొన్న పాపఫలానికి ఈజీవితకాలంలో ఒక సంవత్సరం బొంబాయిలో బ్రతకమని" శపించి నా లలాటంపై లిఖించారు బ్రహ్మజీ!

సదరు బ్రహ్మగారి ఆర్డరు ననుసరించి మా స్టాఫ్ మేనేజరు నన్ను ట్రైనింగ్ నిమిత్తం బొంబాయి ప్రయాణం కట్టించారు. బ్రహ్మచారిగాడు వాడెక్కడయినా బ్రతగ్గలడని.

"ఇంతేలే ఈ జీవితం...."

"కల అయినా నిజమయినా" అని పాడుకుంటు మీనార్ ఎక్స్ప్రెస్‌లో బొంబాయి చేరుకొన్నా. బ్రహ్మచారిగాడ్ని బ్రతకటానికి ఆరడుగుల నేల (పడుకోవటానికే. ఎలాగా పగలంతా ఆఫీసు. రోడ్ల మీదే బ్రతుకుతాం) కోసం మహ కష్టపడి జుహు బీచ్ ఏరియాలో తలదాచుకోవటానికి చోటు చూసుకొన్నా. నేనుండే ఫ్లాట్‌కి ఎదురుగా ఇంకో భవనం. అగ్గిపెట్టెలాంటి అయిదంతస్తుల భవనం. అఫ్‌కోర్స్- మాదికూడా అంతే అనుకోండి. నేను మా ఫ్లాట్‌లోకి వచ్చి నెలయినా ఒక జత కళ్ళు ఎదుటి బిల్డింగ్‌లో నుండి నన్ను అబ్జర్వ్ చేస్తున్నట్టు తెలుసుకోలేకపోయాను. పూర్‌ఫెలోని. ఎలా గమనించానంటే విండోకి మిర్రర్ తగిలించి హెయిర్‌డ్రెస్ చేసుకొంటున్నాను. ఎదటి ఫ్లాట్‌లో విండో కర్టెన్ కొద్దిగా జరిగి రెండు కళ్ళు చోటు చేసుకొన్నాయి. "అరె అంటు ఆశ్చర్యపోయి ఆవలించేసరికి ఆ కళ్ళు మాయమయ్యాయి. విసుగొచ్చి విక్రమార్కుడైనా పట్టు వదలొచ్చేమోగాని నేనుమాత్రం ఆ కళ్ళగురించి తెలుసుకొంటేనేగాని నిద్రపోకూడ దనుకొన్నా (అఫ్‌కోర్స్, ప్రతిరోజు పన్నెండు గంటలు నిద్రపోతున్నాన్సార్). రోజులు గడుస్తున్నాయి. నా యిన్వెస్టిగేషన్‌లో యింప్రూవ్‌మెంటు ఏమాత్రం కనబడలేదుగాని ఆ కళ్ళు మొదటిసారిలా భయంగా కాకుండా ధైర్యంగా సూటిగా చూడటం ప్రారంభించాయి. హేట్సాఫ్ టు దోజ్ ఐస్. నేను కళ్ళలో కళ్ళు కలిపేసరికి సిగ్గో, భయమో మరి ఆ కళ్ళు మెల్లగా వాలిపోయేవి.

మళ్ళీ ఓరగంటచూపులు. మీనాల్లాంటి కళ్ళుగల ఆ మీనాక్షి లేత దొండపండు రంగు పెదవులు. ఆపిల్‌రంగు బుగ్గలు. గెడ్డందగ్గర పుట్టుమచ్చ చూస్తుంటె ఎగిరెళ్ళి గట్టిగా ముద్దెట్టుకోవా లనిపిస్తుంది. ఆనా మీనాక్షి అందాన్ని వరించటానికి మళ్ళీ పుట్టి కవిఅవాలనుకున్నా. రోజూ ఆ కళ్ళు ఏవో బాసలు చెప్తున్నాయి. మా కిటికీ పరిచయంఎంతవరకు వచ్చిందంటె, నవ్వుకుంటూ సైగలు చేసుకొనేవరకు వచ్చింది అతి కష్టంమీద ఇంకో నెలకి. (ఫాస్ట్ ఇంప్రూవ్‌మెంటు కదూ.) మాటలు కలపక పోయినా చూపులతో .... కార్లలో షికార్లు తిరక్కపోయినా మా పరిచయం ఇలా దినదినాభివృద్ధి అయింది. ఓ రోజు ప్రతిరోజు కన్పించే టైముకి ఆ కళ్ళు కనిపించకపోయేసరికి నా కళ్ళు ఎవరి పర్మిషన్ తీసుకోకుండా వాళ్ళ కిటికీ గుండా లోపలి కెళ్ళిపోయి మీనాక్షి కోసం తెగవెదికేస్తున్నాయి. బుర్ర తీవ్రంగా మీనాక్షి జాడ ఎక్కడా అని ఆలోచిస్తూంది. బాత్రూంలోంచి టవల్ చుటుకొని హాల్లోకి వచ్చేసి ఫాన్ స్విచాన్ చేసింది తడిసిన ఒళ్ళు ఆరటానికి టవల్ చుట్టుకునే. అలవాటు ప్రకారం మా ఫ్లాట్ వైపు చూసింది నేను కన్పించేసరికి కంగారు పడి చుట్టుకొన్న టవల్ వదిలేసి లోపలికి పరిగెత్తింది. మీనాక్షిని చూశాను. మళ్ళీ ఈ జన్మకు నాకు మొహం చూపదేమో అనే బాధ. దుఃఖంతో రూం లాక్‌చేసి మేడ దిగాను ఆఫీసు కెళ్ళాలని. ఆశ్చర్యం బాల్కనీలో మీనాక్షి. కన్పించదనుకొన్న నా మీనాక్షి కన్పించడమేకాక నన్ను చూసి నవ్వుతోంది! ఆనందంతో చేయి ఊపాను. చేతివ్రేళ్ళను వింతగా కదిలిస్తూ తన చిన్ని చేతిని సుతారంగా ఊపుతోంది. నాలుగేళ్ళ గీత- ఐ మీన్ నా మీనాక్షి. ●